క్లుప్తంగా

ఫ్లైఓవర్‌పై స్తంభించిన ట్రాఫిక్



సామర్లకోట-కాకినాడ రోడ్డులో నిలిచిన వాహనాలు

సామర్లకోట: పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై లోడ్ లారీ మొరాయించడంతో గురువారం ఉదయం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అదే సమయంలో సామర్లకోటకు చెందిన ఓ పారిశ్రామికవేత్త మృతదేహంతో కైలాసభూమికి సుమారు 200 మంది పాదయాత్రగా తరలివచ్చారు. దాంతో ఈ పాదయాత్ర వెంట ఉన్న వాహనాలూ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఫ్లైఓవర్ నుంచి కాకినాడ రోడ్డులో రైల్వే గేటు వరకు వాహనాలు బారులు తీరాయి. పెద్దాపురం ఏడీబీ రోడ్డులో రాక్ సిరామిక్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు లారీని క్రేన్ సహాయంతో పక్కకు తొలగించడంతో వాహనాలు ముందుకు సాగాయి.

అయ్యంకి సేవలు ఎనలేనివి



అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠకులు

పెద్దాపురం: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం అయ్యంకి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన సభ జరిగింది. పలువురు వక్తలు మాట్లాడుతూ, గ్రంథాలయోద్యమంలో అయ్యంకి పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. నాటి పోరాటమే నేటి గ్రంథాలయ వ్యవస్థకు పునాది వంటిదన్నారు. తొలుత అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో రంగరాయ విద్యార్థినుల ప్రతిభ

- చెస్‌లో ప్రథమ స్థానం కైవసం
- బ్యాడ్మింటన్‌లో ద్వితీయం
- వాలీబాల్‌లో తృతీయ స్థానం

కాకినాడ క్రైం: రాష్ట్ర స్థాయి మహిళా క్రీడా పోటీలలో రంగరాయ వైద్య కళాశాల విద్యార్థినులు అదరగొట్టారు. ఈ నెల 22 నుంచి 24 వరకు రాజమహేంద్రవరం జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో జరిగిన డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రాష్ట్ర స్థాయి ఇంటర్ మెడికల్ విమెన్ టోర్నమెంట్‌లో రంగరాయ విద్యార్థినులు ప్రతిభ కనబరచారు. టోర్నీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్‌గా జీఎస్ఎల్ మెడికల్ కళాశాల చైర్మన్ గన్ని భాస్కరరావు వ్యవహరించగా, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 25 మెడికల్, డెంటల్ కళాశాలలకు చెందిన 560 మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. విజేతలను ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ అభినందించారు. ఆయనతో పాటు ఆర్ఎంసీ స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జీఎస్ ముఖర్జీ, పీడీ గొల్లపల్లి లక్ష్మణరావు విద్యార్థినులకు ప్రోత్సాహాన్ని అందజేశారు. చెస్‌లో షేక్ రఫియా, డి.అనసూయ, డి.అమూల్య, వి.ప్రవల్లిక ప్రథమస్థానంలో నిలవగా, బ్యాడ్మింటన్‌లో మజ్జి తేజస్వి, మజ్జి మౌనిక, చొప్పల నిహారి, కోసూరి శ్రీ హల్లిక, ఏ.మేఘన ద్వితీయస్థానంలో, వాలీబాల్‌లో ఐ.మేరీ మెర్సిబా, రాంపల్లి అలివేణి, పి.సాధన, కె.నాగశ్రీవల్లి, ఆర్.ప్రియాంక, నిఖిత కర్రి, ముచ్చెర్ల నందిని, విశ్వంశెట్టి రేఖ, స్వాతి బొంగి, జి.నమిత, జి.సౌమ్య, ఆర్. హైందవి మధుమణి తృతీయ స్థానంలో నిలిచారు.



ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు



చదును చేస్తూ..



వరి నాట్లు వేసేందుకు పట్టి తోలుతున్న రైతు



ఇసుకపల్లిలో విత్తనాలు వెదజల్లుతున్న రైతు

సాగుకు సన్నద్ధం

- నూతన పద్ధతులపై రైతుల ఆసక్తి
- ఎకరాకు 20 కిలోల విత్తనాల ఆదా
- నియోజకవర్గంలో 12 హెక్టార్లలో సాగు

కొత్తపల్లి: నియోజకవర్గంలో రైతులు ఖరీఫ్ వరి సాగుకు సమాయత్తమవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు అనుకూలించడంతో ఉత్సాహంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కూటమి ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందకపోవడంతో.. చేసేదిలేక అప్పోసొప్పో చేసి వ్యవసాయ పనులకు సన్నద్ధమయ్యారు. ప్రధానంగా సాగులో కొత్త పద్ధతులపై దృష్టి సారిస్తున్నారు. మేలైన దిగుబడులు సాధించాలన్న ఉద్దేశంతో, వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు నూతన విధానాలను ప్రాధాన్యమిస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో ఎక్కువ మంది రైతులు వెదజల్లు, బెంగాలీ ఊడ్పు విధానంలో సాగు చేపడుతున్నారు. ఏళ్ల తరబడి ఖరీఫ్‌లో సంప్రదాయంగా వస్తున్న వరి నాట్ల విధానానికి బదులుగా వెదజల్లు పద్ధతికి రైతులు ప్రాధాన్యమిస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో ఈ ఏడాది 12,087 హెక్టార్లలో రైతులు వరి సాగు చేస్తున్నారు. కొత్తపల్లి మండలంలో 6,167 మంది రైతులు.. 10,264 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేస్తున్నారని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

వెదజల్లు, బెంగాల్ ఊడ్పులకే ప్రాధాన్యం

సాగు ఖర్చును, కూలీల కొరతను అధిగమించడానికి అధిక శాతం రైతులు వెదజల్లు, బెంగాలీ ఊడ్పులకే ప్రాధాన్యమిస్తున్నారు. వీటి ద్వారా వెదజల్లుకు ఎకరానికి 12 కేజీల విత్తనాలు, బెంగాలీ ఊడ్పునకు ఐదు కేజీల విత్తనాలు అవసరం అవుతుందంటున్నారు. వీటి ద్వారా అధిక పంట దిగుబడి వచ్చే అవకాశం ఎక్కువగా ఉండడంతో, మండలంలో ఎక్కువ శాతం మంది రైతులు వీటికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటికే మండలంలో నాగులాపల్లి, ఎండపల్లిలో వ్యవసాయ పనులు మొదలయ్యాయి.



ఊడ్పు చేపట్టిన బెంగాలీ కూలీలు

సాగుపై అవగాహన కల్పిస్తున్నారు



రైతులందరికీ సాగు పద్ధతులపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. వారి సూచనల మేరకు సాగు చేయడం సరళతరంగా ఉంది. ప్రభుత్వం రైతులను ప్రోత్సహించే చర్యలు చేపట్టాలి.

– జి.వెంకటేశ్వరరావు, కౌలు రైతు, ఇసుకపల్లి

అందని పెట్టుబడి సాయం



ఖరీఫ్ సీజన్‌కు పెట్టుబడి సాయంగా ఒక్క రూపాయి కూడా కూటమి ప్రభుత్వం అందజేయలేదు. ఏటా రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా సొమ్ము అందించలేదు. రైతులంతా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా పెట్టుబడి సాయం అందించాలి.

– కాజూలూరి నేర్నెళ్లరెడ్డి, రైతు, రమణక్కపేట

అందుబాటులో ఎరువులు



రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన రైతులు వాటిని తీసుకోవచ్చు. సాగులో వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి.

– వి.జోగిరాజు, వ్యవసాయాధికారి, కొత్తపల్లి మండలం

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

- లాడ్జీల యజమానులతో డీఎస్పీ శ్రీహరిరాజు



లాడ్జీల నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీహరిరాజు

సామర్లకోట: పట్టణ పరిధిలో ఉన్న లాడ్జీల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్టు అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, అటువంటి కార్యకలాపాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ డి.శ్రీహరిరాజు హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో పట్టణంలోని 15 లాడ్జీల యజమానులతో సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతలకు లాడ్జీల నిర్వాహకులు సహకరించాలన్నారు. లాడ్జీల్లో మద్యం సేవించడం, వ్యభిచారం, గంజాయి, గుట్కా బ్యాచ్‌లు రూముల్లో దిగితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. లాడ్జీల నిర్వాహకులు తప్పనిసరిగా రికార్డులను నిర్వహించాలన్నారు. రూముల్లో దిగిన వారి వివరాలు పూర్తిగా ఉండాలని, ఆధార్ జిరాక్స్ తీసుకోవాలని సూచించారు. ఆదాయం కోసం లాడ్జీల నిర్వాహకులు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారికి రూములు ఇస్తే.. నిర్వాహకులపైనా చర్యలు తప్పవన్నారు. సామర్లకోటలో రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్ ఒకే ప్రదేశంలో ఉండడం వల్ల అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే బ్యాచ్‌లు రూముల కోసం వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ, నేరాల అదుపునకు తమకు సహకరించాలని కోరారు. లాడ్జీలను తరుచూ తనిఖీలు చేస్తామని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ట్రైనీ డీఎస్పీ జీవన, సీఐ ఎ.కృష్ణభగవాన్ పాల్గొన్నారు.

సామూహిక వ్రతాలు రెండు రోజులకే పరిమితం

- భీమేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 1, 15 తేదీల్లో నిర్వహణ



సామర్లకోటలోని శ్రీబాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాల్లో వరలక్ష్మీ వత్రాలు రెండు వారాలకే పరిమితం చేశారు. శుక్రవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుంది. దీంతో తొలి శుక్రవారం నుంచి ఇళ్ల వద్ద వరలక్ష్మీ వ్రతాలు చేసుకుని, రెండో శుక్రవారం మినహా.. మిగిలిన శుక్రవారాలు పంచారామ క్షేత్రంలో సామూహిక వ్రతాలు జరిగేవి. బుధవారం ఆలయంలో శాకంబరి అలంకరణ, సారె–చీర, లక్ష పసుపు కొమ్ముల నోము జరగడం వల్ల శుక్రవారం సామూహిక వ్రతాలు చేయడానికి సమయం ఉండదని అధికారులు రద్దు చేశారు. వచ్చే నెల ఒకటి, 15వ తేదీ శుక్రవారాల్లో మాత్రమే ఆలయంలో సామూహిక వ్రతాలు చేయాలని నిర్ణయించారు. 8వ తేదీన మహిళలు ఇళ్ల వద్ద సామూహిక వ్రతాలు చేసుకోవడంతో, ఇక్కడ నిర్వహించడం లేదని ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. 22వ తేదీన అమావాస్యను పురస్కరించుకుని ఏర్పాట్లు చేయడం లేదన్నారు. దాంతో ఈ ఏడాది రెండు వారాలు మాత్రమే సామూహిక వ్రతాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఏడాది లాగే వ్రతాలకు కావాల్సిన తోరాలు, రూపులు, ఆకులు, చెక్కలు, కొబ్బరికాయలు, అరటి పండ్లు, గాజులు, ప్లేట్లు, పూలు, లక్ష్మీదేవి ఫొటోను ఇవ్వడానికి దాతలు ముందుకు వచ్చారన్నారు. వరలక్ష్మీ వ్రతాలకు వచ్చే మహిళలు ఒకటిన్నర కేజీల బియ్యం, కలశ చెంబు, బ్లౌజ్ మాత్రమే తీసుకురావాల్సి ఉంటుందన్నారు. వ్రతాలు నిర్వహించే పురోహితులకు దేవస్థానం నుంచి రుసుము చెల్లిస్తారని తెలిపారు. సామూహిక వ్రతాల్లో పాల్గొనే మహిళలు తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూజల్లో పాల్గొనే భక్తులకు బాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేస్తారని ఈఓ చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై విస్తృత అవగాహన

- జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

పెద్దాపురం: రైతులకు ప్రకృతి వ్యవసాయంపై విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత వీఏఏ, వీహెచ్ఏలపై ఉందని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో గురువారం వీఏఏ, వీహెచ్ఏలకు మూడు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి ఏడీఏ దైవకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రకృతి సిద్ధమైన పశువుల ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, పీడీఎంఎస్ వంటి వాటిని వినియోగించడం ద్వారా ఆహారంలో కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. ప్రస్తుతం పండిస్తున్న పంటల్లో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల మనిషి ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ప్రకృతి సేద్యం ఎంతో మేలని, దీనిపై రైతాంగానికి అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ ఎలియాజర్ మాట్లాడుతూ, నేలను ఎక్కువ సార్లు దుక్కి చేయడం వల్ల భూమిపై పొరల్లో ఉండే మిత్ర పురుగులు, సూక్ష్మ జీవులు నశిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం, కిర్లంపూడి ఏఓలు కె.సంజయ్‌కుమార్, సుధ, ఏఈఓలు ప్రసాద్, స్రవంతి, సురేష్, మాస్టర్‌ట్రైనర్ రామరాజు, సీఆర్పీ శేషు, పెద్దాపురం, కిర్లంపూడి మండలాల వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

భక్తిశ్రద్ధలతో మడుగులమ్మ జాతర



ప్రత్యేక వాహనంలో అమ్మవారు



జాతరలో ఆకట్టుకున్న గరగ నృత్యాలు



శక్తివేషధారణలో కళాకారులు

సామర్లకోట: పంచారామ క్షేత్రం సమీపంలో వేంచేసి ఉన్న మడుగులమ్మ జాతర గురువారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భారీ సంఖ్యలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఏటా ఆషాఢ మాసం చివరి అమావాస్య రోజున జాతర ఉత్సవాన్ని రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ మేరకు ఆలయ కమిటీ నాయకుడు వల్లూరి దొరబాబు ఆధ్వర్యంలో జాతర నిర్వహించగా, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని పూలతోను, విద్యుద్దీపాలతో అలంకరించిన వాహనంపై ఊరేగించారు. బాణసంచా కాల్పులు, బ్యాండ్‌మేళం, శక్తి వేషాలు, గరగ నృత్యాలు, డప్పు, కోయ డ్యాన్సులు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనల మధ్య ఊరేగింపు ఆలయం నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా గాంధీచౌక్‌కు చేరింది. అక్కడ మహిళలు ఊరేగింపునకు స్వాగతం పలికి, అమ్మవారిని దర్శించుకున్నారు. వర్షం కురుస్తున్నా మొక్కులు తీర్చుకున్నారు. గాంధీచౌక్ నుంచి పెద్ద వీధి, గొల్లగూడెం, నీలమ్మ చెరువు, మఠం సెంటర్, కొత్తూరు మీదుగా ఊరేగింపు తిరిగి రాత్రికి ఆలయానికి చేరింది. రైతు సంఘ అధ్యక్షుడు కంటే బాబు, సొసైటీ అధ్యక్షుడు పైబి శ్రీనివాసు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, వల్లూరి వెంకటరమణ, పడాల పుత్రయ్య భక్తులకు సేవలందించారు. సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

తీర గ్రామాల్లో అధికారుల పర్యటన



తీర ప్రాంతంలో పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు

కొత్తపల్లి: మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన ఉప్పాడ శివారు మాయాపట్నం, సూరాడపేటలో గురువారం అధికారులు పర్యటించారు. ఎగసి పడుతున్న అలల ఉధృతి కారణంగా సముద్రపు నీరు ఇళ్లల్లోకి చొచ్చుకొస్తోంది. దీంతో అధికారులు నీరు పోయేలా కచ్చా డ్రైనేజీలను తవ్విస్తున్నారు. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోతకు గురైన గృహాలను సర్వే చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందిస్తామన్నారు. తహసీల్దార్ చిన్నారావు, డిప్యూటీ ఎంపీడీఓ కేహెచ్ఎస్ కృష్ణారెడ్డి తదితరులు పర్యటించిన వారిలో ఉన్నారు.

‘వర్గీకరణ’ రాజకీయ కుట్ర

- మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్

పిఠాపురం: ఎస్సీ వర్గీకరణ దేశవ్యాప్తంగా జరిగిన ఓ రాజకీయ కుట్ర అని, చేసిన చట్టాలు చెల్లవని, వాటిని వెనక్కి తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ ఎస్ రత్నాకర్ అన్నారు. పిఠాపురంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ పార్టీలకు చెంచాగిరి చేసే మాల ప్రజాప్రతినిధులకు, నాయకులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని అణగదొక్కుతుంటే, ఈ వర్గం నుంచి సరైన తిరుగుబాటు రాకపోవడం విచారకరమన్నారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డి చట్టాలు చేసేశారు, ఇంకేముందని అనుకుంటున్నారన్నారు. నాయకులు కొప్పుల ప్రేమ్‌బాబు, బల్ల సత్యనారాయణ, సలాది బాబులు, ఏమని సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్

స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టండి

- అఖిలపక్ష ప్రజా సంఘాల నేతల పిలుపు
- ప్రభుత్వ తీరుపై రౌండ్ టేబుల్ సమావేశం ఆగ్రహం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న బంగార్రావు

పిఠాపురం: విద్యుత్ బిల్లులు తడిసి మోపుడయ్యేలా చేసే స్మార్ట్ మీటర్లను ఎక్కడైనా బిగిస్తే వెంటనే వాటిని బద్దలు కొట్టండంటూ అఖిలపక్ష ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పిఠాపురంలో గురువారం స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సాక రామకృష్ణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, వీఎస్ రెడ్డి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు లలితాదేవి, బోను దేవా, ఎంజే ఫ్రెడ్రిక్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు నక్క శ్రీను, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు ఏసుపాదం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కామిరెడ్డి బోడకొండ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై ఆర్థికభారం మోపుతూ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ మొదలు పెట్టిందన్నారు. ఇప్పటికే వర్తక, వాణిజ్య సంస్థలకు స్మార్ట్ మీటర్ల బిగింపు మొదలైందని, ముఖ్యంగా మహిళలు ఈ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించకపోతే కష్టనష్టాలు తప్పవన్నారు. ఈ స్మార్ట్ మీటర్లను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

తీవ్ర ఉద్యమాలు తప్పవు

స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేసే వరకు అఖిలపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని మాదేపల్లి సత్యానందం అన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ అధికారం చేపట్టక ముందు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించారని, అధికారంలోకి రాగానే వీటిని స్వాగతిస్తున్నారని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టేలా మాటలు మారుస్తున్న కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తోకల ప్రసాద్ మాట్లాడుతూ, స్మార్ట్ మీటర్లను బిగించడానికి సిబ్బంది ఇంటికి వస్తే.. మీటర్‌ను బద్దలు కొట్టాలని పిలుపునిచ్చారు. విద్యుత్ బిల్లులు పెంచడానికి ఈ స్మార్ట్ మీటర్లు అని, ఇంట్లో ఎలక్ట్రికల్ వస్తువులన్నీ స్విచ్ ఆఫ్ చేసినా ఆ మీటర్ గిరగిరా తిరుగుతుందన్నారు. కరెంటు బిల్లు కట్టేటప్పుడు కళ్లు తిరిగే పరిస్థితి వస్తుందన్నారు. అదానీకి లాభం చేకూర్చేందుకు స్మార్ట్ మీటర్ల బిగింపు జరుగుతుందని, వీటిని రద్దు చేసే వరకూ ఉద్యమాలు చేస్తామన్నారు.

గగ్గోలు పెడుతున్న ప్రజలు

స్మార్ట్ మీటర్లపై ప్రజలకు అవగాహన లేదని, కనీసం మీటర్లకు రీచార్జి చేయడం కూడా తెలియదని వీఎస్ రెడ్డి అన్నారు. ప్రజలపై భారాల మోపే స్మార్ట్ మీటర్లు వద్దని ప్రజలు గగ్గోలు పెడుతున్నారని, అటువంటి మీటర్లు బిగిస్తే సహించబోమన్నారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు లలితా దేవి, బోను దేవా మాట్లాడుతూ, ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిట్టుకొట్టి, స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

కొత్తపల్లి: ప్రజలపై భారంగా మారే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రావు, ఏఐసీసీటీయూ రాష్ట్ర నాయకులు గొడుగు సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక ముప్పారపు అచ్చియ్యమ్మ కల్యాణ మండపంలో గురువారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పిఠాపురం నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. దేశంలో సహజ వనరులు, ప్రజల రాజ్యాంగబద్ధ హక్కులను అదానీ, అంబానీ లాంటి వారికి తాకట్టు పెట్టారని వక్తలు మండిపడ్డారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సమావేశంలో నాయకులు ఎస్.అప్పలరాజు, పి.లోవకుమారి, బి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ఎద్దడి లేకుండా చూడండి

- మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్



స్థానికుల నుంచి సమస్యలను తెలుసుకుంటున్న సాయిప్రసాద్

పెద్దాపురం: పట్టణ ప్రజలకు మంచి నీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ పార్కు ఎదురుగా ఉన్న ప్రాంతంలో తాగునీరు అందడం లేదని, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ సరిగ్గా వెలగడం లేదని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో గురువారం ఆయన ఆయా ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ సాయిప్రసాద్ మాట్లాడుతూ, తక్షణం ఆయా ప్రాంతాల్లో మంచినీటి సరఫరాను మెరుగుపర్చాలన్నారు. పగిలిన పైపులైన్లకు మరమ్మతులు సత్వరం చేపట్టి, పూర్తి స్థాయిలో మంచినీటి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా వీధి లైట్లు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ సుధాకర్, కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కర్ తదితరులు ఉన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

బోట్‌క్లబ్: నగరంలోని మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో స్వామి జన్మ నక్షత్రమైన పునర్వసు సందర్భంగా గురువారం కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు పాణింగపల్లి మాధవాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కంకణ ధారణ, పాదప్రక్షాళన, వస్త్ర సమర్పణ, జీలకర్ర బెల్లం, తలంబ్రాలు, మాంగల్యధారణ వంటి ఘట్టాలు కనుల పండుగగా నిర్వహించారు. 108 వెండి తులసీ దళాలతో స్వామివారికి అర్చన వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారి యర్రా వేంకటేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.